# 'ఆ ట క ట్టు'

★

శ్రీ వీరాజీ

గెడ్డం మాసింది.

వార్తాపత్రికలతోబాటు ఓ వార పత్రిక కూడా అర్జెంటుగా కొనుక్కొని వస్తున్నాను. వార్తలు, వారపత్రికలలో పచ్చళ్ళు, కూరలూ, శీర్షికలతో సహా బొమ్మలూ ప్రకటనలూ చదివేయడం; .... 'కాఫీకఫే'లు—అవీ తప్పితే సినీమాలు. వీటితో ఆత్మీయత, యీమధ్య చక్రవడ్డీలాగ పెరిగిపోయింది. ఇటీవల దైనందిన కార్యక్రమం తృప్తి నివ్వదు గాని మహా అర్జంటుగా దాన్ని నెరవేర్చుకోడంలోనే ఉంది అంత శ్రద్ధా. సమాధానం రాని అప్లికేషనుమీద ఆశా, అక్కర్లేని సినిమా చూసి సంతోష పడ్డంలో గొప్పా, అలవాటై పోయింది.

విద్యార్థి నిష్క్రమించి ఉద్యోగి ప్రవేశించలేదు ఎదనింకా. అయినా యింత వెలితి ఎందుకనో ....

పాఠాలు వెళ్లిపోయాయి. పరీక్షలు ఏడాదికి మూడు మార్లు అదో మాదిరి మలేరియాలా దాపురించేవి యిక రావు ! గతానేక సంఘటనల్లో కలిసిపోయాయి. అయితే వెలితి మిగిలింది.... ఎందుకు చెప్మా! సిలబస్ లనేవే, పరిమితంగా ఉంటాయి! అందులోనించి కాంపోజిషనులు రాసుకుని ఆనక వాటినే ఇంపోజిషను రాసుకుని పరీక్షలు రాసేసి (పారేస్తే) అమ్మయ్య అనుకుంటాం. మూడోవంతు మార్కుల కోసం మనమూ, అవి యిద్దామనే వాళ్ళూ తాపత్రయం పడతాం. ఈ మూడోవంతు వ్యవహారం అతి రహస్యమేం కాదు గనుక, మేష్టార్లు యింతకి మించి చెప్పరు. చెప్పినా కుర్రాళ్లు వినరు. సరే .... పేపరు తీసి చూద్దామా అనుకున్నాను. హెడ్‌లైన్లు చదువుదా మనుకున్నాను. కాని దాం దుంపతెగిరి ఎక్కడో తిరుగుబాటు సైన్యం చేత ప్రభుత్వ కైవసం. ఆఫ్రికాలోదో, ఆసియాలోదో కాబోలు. సోషల్ స్టడీసులో లేని రాజ్యంలో తిరుగుబాటూ గట్రా ఉంటుంది. దానికోసరం యిప్పు 'డట్లాసు' వెతుక్కోవాలి. అంచేతనే తిన్నగా రెండోపేజీ చూస్తే చాలునులే అనుకున్నాను.

కాని ఉద్యోగాల కాలమ్ చూడ్డానికి ధైర్యం ఉండాలి. అలవా టుండాలి. తెల్లార్లూ టీ తాగుతూ తూలుతూ పరీక్షలు చదివినప్పుడేనా మెడపీక లేదు గాని యీ ఉద్యోగాల (కలి) కాలం చూసేసరికి దాహం వేస్తుంది. బ్రతుకు భయం కాలేజీగేటు దాటగానే వస్తుందని బళ్లో చెప్పని పాఠం. నిజమే ! గాని అది అంచనాకు మించి వచ్చింది. అయితే నాయీ ఉద్యోగపర్వంలో అదో ఆశ. తృప్తిలేకపోయినా రేపటిమీద మమకార ముంది! ఎండమావు లైతేనేం? దాహం వేసేవాడు పరుగెత్తాలంటే అవేనా అగుపించాలిగదా ?

మా పోస్టుమ్యానుతో ఎంతో దోస్తీ ఐపోయింది నాకు. మూడు బిందెలు ఒకదానిమీద ఒకటి పెట్టుకుని వాటిని నెత్తిన పెట్టుకుని, ఐనా ఒయ్యారంలో లోపం రాకుండా పంపునించి నీళ్లు పట్టుకుపోయే కాపు పిల్లలు కూడా నన్నంత ఆకర్షించడంలేదీ మధ్య. అందమైన వస్తువు కనిపిస్తే కళ్ల పూర్వం నాలుగా, ఆరూ అయ్యేవిగాని యీమధ్య గెడ్డం తడుముకుంటే బాగుణ్ణు ! అనిపిస్తోంది.

వెనుక (అబ్బ ! అప్పుడే కాలేజీ బ్రతుకు గతం అయిపోయింది.) పోస్టుమేన్ ఉత్తరా లివ్వడం అందుకోడం అలవాటు లేదు, ఎప్పుడూ మణియార్డర్లను సంతకం చేయడం తప్ప. ఆ పోస్టుమాన్‌లు ఒక్కడేనా జ్ఞాపకంలేదు నాకు.

కాని యిప్పుడో .... మా పేపరు అప్పారావు తలలో తెల్ల వెంట్రుక లున్నాయని, మా పోస్టుమాను శ్యామూల్ పిల్లలవాడనీ (పేరు కూడా ఎంతో జ్ఞాపకం.) అతని మొహాన కందికాయ ఉందనీ యివన్నీ తెలుసు. చిన్నప్పుడు మాష్టారు ట్రైయాంగిల్ అంటే త్రిభుజము అని కంఠోపాఠం చేయమన్నారు. చూస్తే తెలియదూ ? దాందుంపతెగ త్రిభుజానికి ఎన్ని భుజాలో ! .... కాని పాఠాలు శ్రద్ధగా చదవాలని మాష్టార్లు అలా చెప్తారుట (!)

అప్పారావు పేపరు అందిస్తూ నవ్వుతాడు.

అందుకుంటూ నేను నవ్వుతాను. పోస్టుమానూ అంతే. మావ్యవహారం నవ్వులూ, యివన్నీ—రైలు రావడం రెక్క వాలడం, రైలు వెళ్లడం రెక్క లేచిపోడం లాంటివి.

ఇవాళ శామ్యూల్ యింకా రాలేదు. అతగాడి కొడుకు మెట్రిక్యులేషను ఒక్క మార్కులో పోయిందట. ఒక్క

మార్కు కాదు, ఒక్క సంవత్సరం! అంటాడు శ్యామూలు. 'నామాట విని చదివించు ప్యాసవుతాడు' అంటే నువ్వేం చేస్తున్నావు ప్యాసై అన్నాడు నా అంతవాణ్ణి నన్ను శ్యామూలు. 'ఫేలైతే ఏ పనేనా చేసుకుంటాడు. ప్యాసైతే అదీ నామార్దాయే' ఇది శ్యామూల్ బ్రతుకు గురించి చెప్పే వేదాంతం! 'శ్యామూల్' చెప్పు తెగిందిట. 'అందు కాలస్యం గంటన్నరా?' అడిగాను నేను. "అబ్బే! మెయిలు గంటప్పావు లేటు మామ్మూల్లేగా, నా జోడు కుట్టించుకోటం మరో పావుగంటా!" శ్యామూల్‌కి లెక్కలు వచ్చును. ఆల్జీబ్రా తెలిసిన నాకు మెయిలు అసలు టైము తెలియదు. దసరా కట్నం అడగడమే కాని క్రిస్టమస్ బక్షీస్ అడగడం శ్యామూల్‌కి రాదు. క్రిస్టమస్ ఎందుకో తెలిసిన్నాకు, దసరా సంగతి సందర్భాలు తెలియవు!

నేను అనుకున్నట్లే గవర్నమెంటు ముద్దర్లు లేని ఉత్తరాలే యిచ్చాడు శామ్యూల్. బహుశా మిత్రకోటిలోని ముఖ్య రత్నాలై యుంటారు. ఐనా ఆశ చెడ్డది. ఎవరేనా రాశారేమో ఫలానా దగ్గర ఫలానా ఖాళీ ఉంది, ఫలానివాణ్ణి పట్టుకో దూర్చేస్తాడూ అని.

అలాగే పేపరులోనూ అంతే. నా నోరు తిరగని పేరుగల ఆఫ్రికాదేశంలో విప్లవం. మొత్తానికి సైనిక స్వామికం ఎక్కడో అక్కడ రోజూను! ప్రజాస్వామ్యం తరువాతిది. ఈమధ్య అదే!

"తస్మాత్! యీ విప్లవజాడ్యం మనకు రాకుండుగాక" అని రావాలనే బోలెడు కోర్కెతో ఓ ప్రతిపక్ష నాయకుని ప్రకటన. "అది రావడానికి ప్రతిపక్షులే నాంది కాగలరు" అని అధికార శిరోమణి ఒకడు ప్రతి ప్రకటన.

సరే పేపరు రెండోపేజీ తాపీగా చూడాలని వాయిదా వేసి ఉత్తరాల్లో ఉద్యోగం, కుశల ప్రశ్నలు, పెళ్లి సంబంధం యీ మూడూ తప్ప నాలుగోది ఏమి ఉండగలదా? అని పోస్టు ముద్రలు పరిశీలిస్తూ యింటి గుమ్మం ఎక్కుతూవుంటే సైకిలు గంట 'కింక్రిణేల్' మని.

"ఏంరా! బావగారూ! లవ్ లెటర్సా?" మా సైకిల్ బావ ప్రశ్న. "మరే! నా గెడ్డం చూడు" అన్నాను. వాడు "సెంటిమెంటల్ ఫూల్!" అంటూ వెళ్లిపోయాడు. 'డామిట్! వీడిలాగే నేను కూడా ప్రేమలేఖలు రాస్తే ఎవడి చెల్లెలి మెళ్లోనో పుస్తె కట్టి వాళ్ల బాబు జేబులో నుంచి సైకిలు కొనుక్కొని కింక్రిణేల్ మనుకుంటూ ముప్పై ఏయ్యోయేట 'ఎమ్‌బీ' చదవాలి, అనుకున్నాను.

ఔనుమరి! ఈ సైకిలు బావ అంటే మా పెద్ద చెల్లాయి భర్త.

మరో పంచె బావ ఉన్నాడు. అక్కయ్య మొగుడు. ఇద్దరి పేర్లూ కోటేశ్వరరావులే గనుక యీ సంకేతాల అవసరం వచ్చింది. ఈ సైకిలుబావ మా చెల్లాయికి ప్రేమలేఖలు రాసి ఆనక ఉద్యోగం మాని, మా నాన్న భుజాల కష్టంమీద ఎం. బీ కి వెళ్తున్నాడు.

సరే! ఉత్తరాలను పేపర్లనూ, ఆశగా చూసుకుంటూ లోపలికి వెళ్లాను.

"ఏమే! రాణీ, మీ ఆయన బళ్లోకి వెళ్లాడా? వీడేడీ? విశ్వం!" అంటూ అమ్మ నా కోసరమే కాఫీ పట్టుకొస్తోంది.

"ఆఁ! ఆఁ! వెళ్లారు. సైకిలు లేదుగా ...." అంటూ అమ్మకి చెపుతూ చెల్లాయ్ వచ్చింది. "అదుగో అన్నయ్య" అంది. వారపత్రిక తీసుకుంది. అందులో అది "అప్పడాలు వత్తుట" మీద ఎవరో రాసిన వ్యాసంమీద వచ్చిన అభిప్రాయం మీద తన ఖండన రాసింది. అందుకు .... దాని ఆదుర్దా దానిది.

"ఊరు తెల్లారకుండా ఎక్కడికిరా? బయల్దేరావు. కాఫీ పట్టుకు గంటైంది. కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నా ....' అమ్మ మూర్తీభవించిన అమృతమూర్తిలా నిల్చునుంది నా గది గుమ్మంలో.

"మరేఁ! ఉద్యోగం వెతుక్కుందికి వెళ్లానమ్మా" నవ్వుతూ (నవ్వు అద్దంలో చూసుకుని ప్రాక్టీసు చేశాను లెండి) కాఫీ అందుకున్నాను.

"అలాగేం? మా అన్నయ్యవి కదూ! .... అక్కడ మన కాలవలో వలేస్తే ఉద్యోగాలు పడ్తాయి కదురా? అన్నాయ్.' చిన్న చెల్లాయి శాంతి నవ్వుతూ వచ్చింది. అంతలో అక్కయ్య, "అదే పోనీండిగాని, ముందు టిఫిను తిను, ఆనక స్నానం చేద్దువుగాని" అంటూ ఇడ్డెన్ల ప్లేటులో పట్టుకుని వచ్చింది.

ఇంట్లో టిఫిన్ల తంతు అక్కయ్యది—పై పెత్తనం శాంతిది.

"చూడవోయ్! అబద్ధం కాదు ...."

పేపరు ఫట్‌మని పేజీలు విడేటట్లు దులిపి "యివన్నీ ఉద్యోగాలే" నన్నాను నేను శాంతి నుద్దేశించి.

"బావుంద్రా మీ వరస! యివందుకోండి, నా కవతల పన్లున్నాయ్!" అని 'అవి' యిచ్చి అక్కయ్య వెళ్లిపోయింది.

అమ్మ నవ్వుతూ కప్పు నందుకుని "ఓరిపీ! అన్ని ఉద్యోగా లెందుకురా నాన్నా, మనకీ? నీకేది ప్రాప్తముందో

అదే వస్తుంది. ఉద్యోగమూ రాక ఋాడొచ్చాకా పెళ్లామూ రాక ఏమవుతుంది ? రోజా, తెల్లారకండా ఋా పేపరు సేవ మానేసేయ్'' అని వెళ్లిపోయింది.

అమ్మకు భయం. ఆ యింతా నేను చిక్కిపోతే ఆడపిల్లల తండ్రులు ఋా యింటిమీద కాకులై వాలరని !

''శాంతీ ! సురేష్‌ని పోయి నాలుగు పొడుగు కవర్లూ ఒక ఉత్త కవరూ, స్టాంపులూ అవీ అన్నీ తెమ్మనవూ ?''

''ఎందుకండీ ! దొరగారూ ! ఎవరికీ ఉత్తరాలు రాస్తా రేవ్ .... ?'' కొంటెపిల్ల శాంతి. రోజా మామూలే అయినా ఆశగా అడుగుతుంది.

''చెబుతాగా .... మీ ఆయన్ని వెతకాలి. త్వరగా రాఫో.''

''ఛీ ! ఫో ! నే చెప్పను .... ముందివాళ ఒచ్చిన ఉత్తరాలు చూపించు .... ''

పిచ్చిపిల్ల దీనికి మాధవి రాసే ఉత్తరాల్లో ప్రేమ ఉంటుందని నమ్మకం. అనుమానం. కాని మాధవికి పెళ్లయి పోయిందని మొగుడికి ఉద్యోగం కూడా ఐపోయిందనీ తెలియదు. అన్నయ్యలంటే నవమన్మథులనో గోపీలోలురనో అనుకునే చెల్లెమ్మల్లో మా శాంతిది ఫస్టుమార్కు.

ఉత్తరాలు బల్లమీద పడేసి కుర్చీలో కూలబడి బల్లమీద కాళ్లు పారేశాను.

శాంతి నవ్వుతూ ''ఐతే దాచుకో'' మని వెళ్లిపోయింది. ఆడపిల్ల కదా ! బల్లమీద పడేసి చూసుకోమంటే దాచుకోమంది. దాచుకుంటే చూస్తానని రక్కుతుంది.

తొలి ఉత్తరం చింపేను. ''నీతో గడిపిన రోజులు ఎలా మరిచిపోను డియర్! .... '' నవ్వొచ్చింది నాకు .... మా శంకరం .... రూర్కెలాలో ఉద్యోగం అయింది వీడికి. అయినా విచారిస్తున్నాట్ట! నాకే ఆ ఉద్యోగం అయితే వీణ్ణి వీడితో గడిపిన రోజులూ కూడా కలిపి మర్చిపోదును .... ఏమో .... కాని వాడు రాసిన ఉత్తరం అంతా చదివేసరికి నిజమే. ''వీడు నన్ను యెంతో ప్రేమించాడు'' అనుకున్నాను. దూరాభారం కూడానా? .... రైలుకి వెళ్లి చూడాలి. రూర్కెలా వెళ్లిపోతున్నవాణ్ణి ధైర్యం చెప్పి పంపాలి. ''అది నా తక్షణ కర్తవ్యం''—

''ఇదుగో కవర్లు .... త్వరగా స్నానానికి రమ్మని పెద్దక్కయ్య చెప్పింది.'' సురేష్ వచ్చాడు—వా డెప్పుడు పరిగెడుతూనే వస్తాడు—నడక అలవాటులేదు.

''చేస్తానుగాని, అమ్మావాళ్లూ ఏం చేస్తున్నార్రా?'' అని అడిగాను. ఇంకా మా శంకరం గురించే ఆలోచిస్తున్నాను.

సురేష్ కుర్రవెధవే ఐనా అదోలా నవ్వి ''నీ గురించే మాట్లాడుకుంటున్నారు'' అన్నాడు.

''చచ్చేవ్ ! ఉద్యోగం, సద్యోగం లేదని కాదుగదా ?'' సరిగా అటెన్షన్‌లో కూచున్నాను.

''ఉహూ.... మామయ్య వచ్చారుగా ! బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిర్నా.... అని....'' అంటూ వాడు చేతి కందకండా తుర్రుమన్నాడు.

''హే భగవాన్ ! మావయ్యల నెందుకురా పుట్టించావ్'' తల తాటించి కుర్చీలో వెనక్కి చేరబడిపోయాను. నేను ఆటలాడుతున్నా నంటాడు అతగాడు పైగా నా ఆట కట్టిస్తా నంటాడు— దుంపతెగ.... ఇంత పిసరు సానుభూతి లేదు. పైగా ''మా రోజుల్లో ఇంకా తిప్పలు పడ్డాం....పెద్దవాళ్ళ కాళ్లుపట్టి వీపుగోకి బ్రతికి బాగుపడ్డాం .... ధక్కా మొక్కీలు తినాలిరా.... ఓ కాయితంముక్క తేడం.... దానికి ఫ్రేము బిగించడం ఆనక 'డిగ్రీ' అంటూ పెద్ద కబుర్లూ! అయితే, ఇంతవాళ్ల మవుదుమురా'' అంటాడు. ఆ కాయితం ముక్కకై ఎన్ని అహర్నిశలు అఘోరించామో తెలీదుకదా ఆయనకి ! ఉత్త పాతకాలం మనిషి మరి ఏం చేస్తాం !

ఎక్కడో ''సమ్మంధాలున్నాయంటాడు.'' ''ఎవణ్నో పట్టుకుంటే ఉద్యోగం వస్తుందంటాడు.'' దగాగోర్ బడాయి కోర్ మామయ్య.

''హతవిధీ ! నాకు పెళాం అవసరమో కాదో నాకు తెలియదా?'' ఇంత నమ్మకం నామీదనున్నదే వీళ్లకీ ఏం చేయాలి? ఆ పిల్లదెవరో దానిక్కూడా ఈ నమ్మకం నా మీద నుండొద్దా ? దానికి ఆలోచనలే ఉండరాదు కాబోలు !! ఈ మాటే బయటికన్నానో, బాబోయ్ ? ఒక్కసారి కంచు గంటల్లాంటి మూడు కంఠాలు నా మీద దాడిచేస్తాయ్ ! మామయ్య క్రౌర్యం దీనికి గుణక మవుతుంది. ఉద్యోగం ఐతే గాని పెళ్లి యేమిటీ ?'' అంటేచాలు.

''మీ ఆవిణ్ణే ఒంటి స్తంభం మేడలో కూచోబెట్టి పారాయిస్తూ ఉంటావా ? లేక కృష్ణపరమాత్మలా పాద తాడనం చేయించుకుంటావా ?'' అంటుంది. కొంటెగా అక్కయ్య.

బావ ఏం చేస్తాడో మనకి తెలియదుమరి. పొన్లే పెద్దదాని రహస్యాలు మన కెందుకని గాని లేకపోతేనా ?....

అంతలో : అమ్మ నా అభ్యుదయ భావాలన్నీ 'నేరాలు' క్రిందే జమ కడుతుంది.

"నీకు ఉద్యోగం వచ్చేకా పెళ్లాం కావాలా ? అంటే ఉద్యోగం, పెళ్లి, రెండూ చంక నెత్తుకుని నువ్వు చక్కాపోతా నంటావ్ ? అంతేనా ? చూశావురా అన్నయ్యా ! వీడితంతు ఇక నాకు వీడు 'ఆలి' వచ్చాకా కూడేం పెడతాడ్రా" అని వాళ్లన్నయ్యకి (పైన నేను మనవిచేసిన విలన్‌కి) ఫిర్యాదు కూడా చేస్తుంది వెర్రిబాగుల అమ్మ.

అమ్మకి వాళ్లన్నయ్య మాటపదహారు వన్నెల బంగారం—

ఆ మావయ్య వెంటనే "అంతవాడే వీడు" అంటూ అందుకుంటాడు— పైగా "ఆ మూడు ముళ్ళూ వేశాకగాని వీడికి ఉద్యోగం రానివ్వకూడదు— అలా ఐతేనేగాని వీడి ఆటలు కట్టవ్" అంటాడు కూడాను.

నా అభ్యుదయ భావాల మీద అమ్మకు కలిగే అపోహ లను తొలగించడం బ్రహ్మతరం కూడా కాదు. ఈ ఒక్క మావయ్య కుతప్ప— ఈ ఆడ అమ్మలు, అక్కలు, చెల్లెలూ మొదలైన వాళ్లతో వాదించగల తర్కజ్ఞానం గాని వాదనా పటిమగాని ఏ టెక్స్టు పుస్తకంలోనేనా రాసినా బాగుణ్ను! మొత్తానికి నా నోరు కట్టుబడిపోయిన గంటదాకా వాళ్లంతా నా మీద దండయాత్రను ఉపసంహరించుకోరు.

పేపర్లో 'వాంటెడ్ కాలమ్స్' చూస్తూచూస్తూ ప్రాణం విసిగి 'మాట్రిమోనియల్' కాలమ్స్ కేసి కన్ను తిప్పు తానో లేదా, కాలేజీలో ఇంటర్మీడియేట్ వెలగబెట్టిన నేరాన, ఇట్టే పసిగట్టేస్తుంది ఆ విషయం చెల్లి.

"ఒరే ! దాచినా దాగదురా.... నీ కెందుకురా ఆ శ్రమ?. రంభలాంటి పెళ్లాన్ని...." అంటుందది. దాని మాటలను సగంలోనే అందుకుంటాడు మావయ్య.... "వాళ్ల నాన్న అనగా 'రంభ' నాన్న వేయించే ఉద్యోగాన్నికూడా తెస్తాం" అంటూ పూర్తి చేస్తాడు.

"మీకు జీవితమంటే ఆటగా ఉందన్న మాట ?" నేను అభిమన్యుడంత కోపం ప్రదర్శిస్తాను.

అంతా నవ్వేస్తారు.

"మాకుకాదు జీవితం అంటే ఆటగా ఉంట— అది నీకే.... అది కట్టించాలనే వెళ్లారు మీ నాన్నగారు" అంతా ఏకగ్రీవ తీర్మానం చేస్తారు.

"నేను.... నేను.... పార్వతీశంగారి ఇంటికి వెళ్తాను. చదరంగం "ఆడుకుందికి"— లేచి వెనుదిరగకుండా వెళ్లిపోతున్నాను — ఆడియన్స్ అల్లర ప్రారంభిస్తే స్టేజీమీదనించి వింగ్‌లోకి పారిపోయే నటుడి లాగ !

గుమ్మంలో అసలు సూత్రధారి ప్రత్యక్షం.

"ఏరా.... విశ్వం ! ఉండు నీతో మాటాడాలి" అంటూ నాన్న ఎదురయ్యాడు.

తిరిగి మేకపిల్లలా వచ్చి కుర్చీలో కూలబడ్డాను.

"కాయా ? పండా ?" నాన్న అంటే బోత్తుగా (ఆయన బొద్దు మీసాలంటే కూడా) భయంలేని అమ్మ ప్రశ్న :

"పండున్నరా" నాన్న జవాబు.

"ఆటకట్టు" విలన్ మావయ్య ఆనందం. చివరికి కథ అంతా టూకీగా ఏమిటయ్యా? అంటే....."తాంబూలాలు పుచ్చుకుంటే: నేను కోరిన ఉద్యోగం ఆనక కన్యాదానం చేస్తాట్ట ఓ మోతుబరిగారు. పేరెందుకు లెండి పెద్దమనిషిగదా...."

పార్వతీశంగారితో చదరంగం ఆడుతున్నాను. ఐనా మూడేళ్ల క్రితం జూలైలోనే, పదిహేనో తేదీనాడు రాత్రి అవ తల వానకురుస్తూ ఉంటే కిటికీలోనించి మీదపడే 'జల్లు' ననుభవిస్తూ డైరీలో రాసుకున్న మాటలు.... 'నేను ప్రేమించి పెళ్లి చేసుకుంటాను.... అదీ ఉద్యోగం వచ్చాకా పెళ్లి చేసుకుంటాను.... దమ్మిడీ కట్నం అడగను" అని రాసిన కవిత్వమే జ్ఞాపకం వస్తోంది నాకు.

"ఇదుగో నా గుర్రం గెంతింది.... నీ ఆట కట్టు !" పార్వతీశంగారికి, చెస్సాటలో గెలిస్తే హిట్లరంత శరీరమై పోతుంది!

"ఆట కట్టు !" అన్నమాట ఫెడీలుమని తగిలిందినా కర్ణపుటాలకు.

"విలన్ మామయ్య ప్రవేశించాడుగా లేపోతే ప్రేమించే పెళ్లి చేసుకుందును" అన్నాను పిక్కలు కలిపేస్తూ నేను.

"ఇంకా చెప్పావుకాదు.... ? ఉద్యోగం ఇచ్చే మావ గారేనా ?.... అంటూ పార్వతీశంగారు తనకే మరో పెళ్లి కాబోతున్నంత సంతోషంగా నా వీపుమీద 'ఛెళ్లు'న ఒక్క చరుపు చరిచాడు.—

"అదీ సంగతి.... అందుకే అబ్బాయిగారి ఆటగట్టింది' అన్నాడు మళ్లీ పరమ రహస్యం కనిపెట్టినట్లు.